

# టేకిట్ ఈజీ!!

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

# శీనిగాడూ - చిత్రలేఖనమూ - ఇందుమతీ

అసలీ **డూయిట్ యువర్సెల్ఫ్** పుస్తకాలెవడుకనిపెట్టాడ్రా బాబూ. **నడుచుట ఎట్లు ? కూర్చొనుట ఎట్లు ? ఇల్లుపీకుట ఎట్లు ? పందిరివేయుట ఎట్లు ?** ప్రతీదీ డూయిట్ యువర్సెల్ఫే . ఏతావాతా నాకర్థవయ్యిందేటంటే, డూయిట్ యువర్సెల్ఫ్ పుత్తకాలు చదివి శోభనవన్నా చేసుకోవచ్చుగానీ, **మ్యూరల్ పెయింటిగులూ, గాడిదగుడ్డులూ** మొదలెట్టకూడదు. వెధవకక్కుర్తి కాకపోతే, ఆచింకిణి నాలుగొందలకి నిక్షేపంలా పిల్ల రూమంతా పింకురంగేసి, దానిక్కావలసిన డోరా, కోతీ వేసిపెడతానంటే మనసొప్పలేదు. డబ్బుకీ ప్రాణానికీ లంకె. ఆ నాలుగొందల్లో అదెక్కడ మేడ కట్టేస్తుందో, మనకెక్కడ నష్టవొచ్చేస్తుందోనని బెంగ. ఇప్పుడు పీక్కోలేక ఛస్తున్నాను. అయినా డోరా బొమ్మ వేయడవంటే డోనట్లు తిన్నంత సులభవనుకున్నాను. **"ఇంతలావున్నావు, చిన్న పాము మంత్రం రాదా?"** అన్నట్టుగా, చిన్నప్పట్నించీ చిత్రలేఖనంలో మనం పులి కదా, సహజ పాండిత్యులం కదా, ఆ .. ఆ మాత్రం వెయ్యలేవా అనుకున్నాను. తీరా చూస్తే అది డోరాలా లేదు, అరుంధతి సినిమాలో **అఘోరా**లా ఉంది, పిల్ల జడుసుకునేట్టుగా. మీకు పుణ్యవుంటుంది, నేనీబొమ్మ చెరిపేసేంతవరకూ, మా పిల్ల ఈరూములోకి రాకుండా కాపలా కాద్దురూ...

అయినా అదేవిటో, ఘనత వహించిన నా చిత్రలేఖనం ఇల్లా చెదలుపట్టేసిందేవిటో.. అసలు ఈ దుగ్ధ నాలో ఎలామొదలైందో మీకు చెప్పేస్తేగానీ, నా ప్రాణం తేలికపడదు..

రాజకుమారుడు ఆల్రెడీ ఆర్ట్ డైరెక్టు గీసేసిన అందాల రాజకుమారి పెయింటింగుకి మళ్ళీ ముంగురులు దిద్దుతున్నాడు పందుంపుల్లలాంటి బ్రెష్షుతో. కట్ చేస్తే వాహినీ స్టూడియోలో స్థంభాల మజ్జెన పాట. కత్తిలాంటి వీరోయిను మెలికెలు తిరిగిపోతూ చెక్కమెట్ల ఆకాశంలోంచి దిగివచ్చేస్తూ వుంటుంది, పక్కనించి ఒదిలే పొగకి వచ్చే దగ్గు ఆపుకుంటూ..

కత్తిమీద చెయ్యేసి, స్కూలుకెళ్ళే ఆడపిల్లలేసుకుంటారే, అల్లాంటి స్కర్టు వేసుకుని, పైనించి దిగే కత్తినే చూస్తూవుంటాడు వీరో. వెనకాలనించి రాజేశ్రావుగారు కత్తిలాంటి పాటేసుకుంటారు..

ఫాస్ట్ ఫార్వర్డ్ చేస్తే మేడమీద సూపర్ స్టారు గారు కూర్చుని, తల ఒక టిపికల్ ఏంగిల్ లో కుడివైపుకి పెట్టి, కొంచెం పెద్ద కాన్వాసు మీద ఆల్రెడీ అతికించేసిన వీరోయిన్‌కి బొట్టు దిద్దుతూ ఉంటారు. కట్‌చేస్తే, కలల్లో పాట, తెరమీద జయచిత్రా.. యెనకాల ఎస్పీ పాటా.. **"ఏ గీత గీసినా నీ రూపమే..."** ఇంకేం కావాలి, వీనుల విందూ, కన్నుల పండగా..

ఇల్లాటివన్నీ చూపించి చెడగొట్టేహారు చిన్నపిల్లాణ్ణి. ఇల్లా బొమ్మేయడవేవిటి, అదిగో అల్లా తక్కున వీరోయినొచ్చేసి, ఎడం బుగ్గ కాకెంగిలి చేసెళిపోతుందని ఫిక్సయి పోయాడు శీనిగాడు, అంటే నేను..అక్కడికీ పన్నెండేళ్ళొచ్చేదాకా పకడ్బందీగా, కట్టుదిట్టంగానే పెంచారు ఇంట్లో, ఇల్లాంటి స్వతంత్ర భావాలూ, చట్టుబండలూ రాకుండా. కానీ వాళ్ళకేంతెలుసు. టీ.వీ శీనివాసు దగ్గరికి రానిచ్చో, శీనివాసే టీ.వీ వున్న వారింటికి వెళ్ళి, గడపమీంచో, కిటికీ ఊచల్లోంచో చూచునని, ఆయింటివారు టీ.వీ కట్టేసేంతవరకూ అచటనే వేళ్ళాడునని.

పాయింటేంటంటే, బొమ్మలెయ్యాలనే కోరిక నన్ను నిలబడనివ్వలేదు, నించోనివ్వలేదు. దానికి తోడు స్కూల్లో మేప్ ట్రేసింగు అని వుండేది, నిక్షేపంలా ఉన్న మేప్ కి నానా రంగులూ పూసి, ఇది ఆసియా, ఇది ఐరోపా అనుకుంటూ రాయాలని. సరే మన పోరు పడలేక, టాలెంటు తెలియక **ఒక ముదురాకుపచ్చ, ఒక ఎరుపు, ఒక నలుపు** - అచ్చంగా మూడంటే మూడే స్కెచ్ పెన్నులు కొనిచ్చారు ఇంట్లో, ఓ దుర్ముహూర్తాన, మళ్ళా ఏడాదివరకూ ఇంకేం కోరికలూ కోరకుండా పక్కవాళ్ళ టీ.వీ మీద ఒట్టేయించుకుని. సరే ఆమేపింగులూ, పులవడాలూ పూర్తిచేసాను. బయాలజీ రికార్డులో జిరాఫీ వెయ్యమంది టీచరు. నేను ఖడ్గమృగం వేసి, మెడ కాస్త పొడుగ్గా వేసాను, ఇదే నా జిరాఫీ అనుకుంటూ. ఆవిడ నా జిరాఫీ చూడలేక,శుక్రవారాలు అన్నం మానేసింది, మనశ్శాంతి కోసం. ఇంక ఇలా అయ్యేపనికాదని ఇండిపెండెంట్ కన్సల్టింగు మొదలెట్టా. ఎనిమిదోతరగతి వేసంగి సెలవల్లో, ఏదో పేపర్లో వచ్చిన నెమలి బొమ్మని చూసి ఇన్స్పైరయ్యా. అంతే, కొద్దిక్షణాల్లో అది నా తెల్లకాగితమ్మీద వచ్చి వాలింది. **ఎర్రటి నెమలి, ఆకుపచ్చ పురి, నల్లటి కళ్ళూ !!** నాన్నగారికి చూపించా, అన్నంతిన్నాకా. ఏకళనున్నారో, కాసేపు పరీక్షగా చూసి చెప్పారు,

**" రాబందులకి పురి ఉండదు వెధవా, వేస్తే పూర్తిగా రాబందు వెయ్యి, లేకపోతే పురివిప్పిన నెమలి వెయ్యి, అంతేగానీ ఏవిటీ హైబ్రీడూ? "** నాకొళ్ళుమండిపోయింది. అయినా సరే, సెకండొపీనియన్ కనుక్కుందామని అమ్మకి చూపించా.

**" శీనాడూ, నెమలికి ఆ  గెడ్డవేవిట్రా, నిప్పుకోడిలాగ. అయినా స్కెచ్ పెన్నులన్నీ ఇల్లా తగలెయ్యకు, మళ్ళీ వచ్చే యేడాదికి కావాలిగా, దాచుకో.."** .

నాకు చిర్రెత్తుకొచ్చింది. అంటే ముష్టి మూడు పెన్నులతో, పదోతరగతిదాకా లాగించేద్దావని చూస్తున్నారన్నమాట, పక్కవాళ్ళ టీ.వీ పచ్చడైపోయినా సరే, నేను ఈ శెలవలయ్యేసరికి ఈ పెన్నులు అవగొట్టకపోతే చూస్కోండి.. అంటూ పంతం పట్టాను.

ఇంతలో మా పెద్దత్తయ్యొచ్చింది. బొమ్మ చూసి చాలా ముచ్చటపడింది..

**"పాపం "చూడు" నెమల్రా. నించోలేకపోతోంది, అంత పొట్టేసుకుని. అయినా ఎక్స్ ప్రెషను బాగా కేచ్ చేసావురా.."**అంటూ  వీపుతట్టింది. ఇవినాకోలెఖ్ఖా. తరవాత ఓ ఎనిమిది **కొబ్బరిచెట్లూ, వెనకాల ఆకాశం, వాలిపోతున్న సూర్యుడూ, ఇంటికెళిపోతున్న పక్షులూ** గీసా. **ఎర్రటి ఆకాశం, నల్లటి సూరీడు, పక్షులూ, పచ్చటి చెట్లూ.** ఓ లేపాక్షీ పుస్తకానికున్న అట్ట చింపేసి, దానికతికించి నారూములో పెట్టా, మేకుకున్న హనుమంతుడి ఫొటో తీసేసి అక్కడ తగిలించా. ఓ రొండ్రోజులు పోయేసరికి నాకే భయంవేసింది, పొద్దున్నే లేవగానే ఎర్రటి ఆకాశాన్నీ, నల్లటి సూర్యుణ్ణీ చూసి. ఎవరూ చూడకుండా లోపల దాచేసా. ఇల్లాకాదని కూర్చున్న హనుమంతుడి బొమ్మ గీసా, నేనే.

మా అత్తయ్య చూసి

" గద మరీ చిన్నగా వుందిరా" అంది.

" **అత్తయ్యా, అది గదకాదే బాబూ, చిడతలు, ఆయన రాంభజనచేసుకుంటున్నప్పుడు గీసిన పోట్రేటు** " అని ఆవిణ్ణి కన్విన్సు చేసేసరికి తల్రపాణం తోక కొచ్చింది, నాకూ, హనుమంతుడికీ కూడా. తరవాత **ఎగిరే హనుమంతుడూ, రెండు నలుపూ, ఎరుపూ మందారపూలూ, ఒంటరి ఆకుపచ్చ రామచిలుకా.., నల్ల కొలనులో ఆకుపచ్చ కలవపువ్వూ, ఎర్ర తవలపాకులో ఎర్ర వినాయకుడూ**..అబ్బో, చాలా గీసా.. ఆఖరికి ఎర్ర స్కెచ్ పెన్ను కూడా అయిపోయింది, అయినా వీరోయిన్ను రాలేదు. ఇంక ఆశలువదిలేసుకుని, లావుగా ముద్దగా పడే ఇంకుపెన్నుతో ఈనాడులో శ్రీధర్ కార్టూన్లు చూసి అవే మళ్ళా వేయడం మొదలెట్టా. బానే వచ్చేవి. కానీ నాలాంటి రాజకుమారుడు కార్టూన్లు గీస్తే, కనీసం ఏజ్ బారైపోయిన వీరోయిన్‌కూడా రాదు. మనకావిషయం తెలిసేసరికి ఇంటరైపోయి, డిగ్రీ మొదలైపోయింది.

**ఎంటర్ ఇందుమతి...**

అసలు అమ్మాయిలు అంతబాగా నవ్వుతారని అప్పటిదాకా తెలియదు. మైక్రోబయాలజీ తీసుకుంటే మంచి ఫ్యూచరుంటుందని నాకెవ్వరూ చెప్పనే లేదు. తొక్కలో ఎంపీసీ, తూచ్ అనేసి, మైక్రోబయాలజీలో జేరిపోదావా అనిపించింది ఆనవ్వు చూసాకా. కానీ ఇంట్లో చెబితే విస్తర బైటేస్తారు, అసలే ఇంజనీరింగు గవర్నమెంటుకోటాలో రాలేదని పోరు, ఎందుకులే అని ఊరుకున్నా. అయినా దేవుడు నా పక్షాన వున్నాడు కాబట్టి శాంస్క్రీటు క్లాసొకటి పెట్టాడు కాలేజీలో. సంస్కృతం టీచరు పాఠం చెబుతోంది "**ఇందుమతీ స్వయంవరం**". ఆవిడ దీపశిఖలాగా వెడుతోందిట ( **టీచరు కాదు, ఇందుమతి..**) , రాజులంతా ( అంటే మా **తొట్టిగాంగు**) తమ సామాన్లు సద్దుకుని, దేభ్యమ్మొహాలేసుకుని చొల్లు కార్చుకుంటూ చూస్తున్నారట. ఆవిడ ఇలా రావడం, అలా వెళిపోవడం, వీళ్ళ బల్బులారిపోవడం. ఆవిడ వచ్చి వచ్చి అజమహారాజు(అంటే **యువర్సు ట్రూలీ**..అర్థం చేసుకోరూ..) మెళ్ళో ఢామ్మని దండేసి ఝామ్మని వాలిపోయిందిట గుండెలమీద. కాళిదాసూ, ఒప్పేసుకున్నాం, నువ్వు టూ మచ్ బాసూ..

ఇంతలో బెల్లుమోగింది, నా గుండె గుభిల్లు మంది, ఇందుమతి హృదయం ఝల్లుమందని నాకనిపించింది. ఆమె నవ్వుతూ వెళిపోయింది లేదా వెళిపోతూ నవ్వింది, వెనకాలే ఆమె చామనచాయ చెలికత్తె సునంద కూడా వెళిపోయింది. ఎందుకైనా మంచిదని మాతొట్టిగాంగ్ అంతా ఒకళ్ళకొకళ్ళు సారీ చెప్పుకున్నాం, డ్రీం సీక్వెన్స్‌లో ఒకళ్ళగురించి మరొకళ్ళు ఓడిపోయి చొల్లుకార్చుకున్న రాజుల్లా , చెత్తగా ఊహించుకున్నందుకు. **అక్క, చెల్లెలు, వదిన, పెళ్ళైన మరదలు** ఇల్లాంటి రిలేషన్ షిప్పులకి మాత్రం ఎవ్వడూ ఒప్పుకోలేదు, ఎంత బతిమాలినా. అయినా నేను తగ్గలేదు. ఇంటికొచ్చాను. ఒక తెల్లకాగితాల నోట్ బుక్కు నాకంట పడింది. దానిమీద **చెల్తే చెల్తే** పాటలో మీనాకుమారిలాంటి ఓ మొగల్ పెయింటింగుంది. నాలోని కళాకారుడు చెలరేగిపోయాడు. ఓ పెన్నుచ్చుకుని నాలుగ్గెంటల్లో ఆ మీనాకుమారిని నా ఇందుమతిని చేసేసి, సూపర్ స్టార్ లా ఓ బొట్టేట్టేసి, కింద ఒక కాప్షను కూడా తగిలించాను..

"**పలకమన్న పలకదీ పంచదార చిలక, కులుకే సింగారమైన కొల ిసిగ్గుల మొలక..**"

ఆ కళాఖండం నాన్నగారికి చూపిస్తే, నా శరీరంలో మాంసఖండాల రేషో దెబ్బతింటుందని, పెళ్ళిమాటలదాకా వచ్చాకా, అప్పుడు చెప్పి సర్‌ప్రైజు చేద్దామని డిసైడయిపోయి, అదుచ్చుకుని మర్నాడు సంస్కృతం క్లాసుకెళ్ళా. ఆరోజు మా ఇందుమతిని ఎవరో డ్రాపు చేసారు క్లాసుకి. అతను వాళ్ళ అన్నయ్య అని నేనూ, తమ్ముడని మిగితా గాంగూ నిర్థారించేసాం. ఎందుకో నా పెయింటింగు చూపించే ధైర్యం చాలలేదు. అటు తరవాత ఆ అమ్మాయి వాళ్ళ సీనియర్లతో మాట్లాడినా మాకు ఎంతో ఇబ్బందిగా ఉండేది. రానురాను అలవాటైపోయింది. కేవలం ఆ అమ్మాయి నవ్వుకోసం

క్లాసుకెళ్ళేవాళ్ళం మా గేంగ్ పది మందీ. ప్రతీవాడూ తనని చూసే నవ్వుతుందని ఆనందపడేవాడు. మా ఆనందాన్ని చూసి ముచ్చటేసి మరీ నవ్వేది మా ఇందుమతి. రాను రాను మనసులోంచి కుళ్ళు అయిడియాలన్నీ పోయి, ఆమె నవ్వు చూస్తూంటే, ఓ హిమాలయాలని చూసినట్టో, ఓ తాజ్మహల్ ఎదురుగ్గా కూర్చున్నట్టో అనిపించేది హాయిగా. అలా డిగ్రీ అయిపోయి ఇరవయ్యేళ్ళయిపోయినా, ఇప్పటికీ ఆ పెయింటింగు మా హైదరాబాదు ఇంట్లో ఎక్కడో వుండేవుంటుందని నా అనుమానం. ఆ తరవాత నేను మరో బొమ్మ గీయలేదు. గియ్యకపోయినా సరైన సమయంలో నాకూ బెమ్మాండవైన వీరోయిన్నొచ్చేసింది., నన్ను వీరోని చేసేసింది. అద్గదీ బేక్గ్రౌండు..

సర్లెండి, మీరుమాత్రం ఎంతసేపు కాపలాకూర్చుంటారుగానీ, కాస్త ఇసింటా వచ్చి ఆ బ్రెష్షు అందుకుని, అటునించి చెరుపుకురండి ఈ దిక్కుమాల్న బొమ్మని , పిల్ల స్కూలునించొచ్చే వేళకూడా అయ్యింది.. అన్నట్టు నేనో కొత్త పుస్తకం మొదలెట్టా.

దానిపేరు "జస్ట్ పే ఫర్ ఇట్ యువర్సెల్ఫ్.."

